# పది పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచే పరీక్షలు
- ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ అధికారులు

**చాదర్‌ఘాట్ :** సైదాబాద్ మండల పరిధిలో 5,131మంది విద్యార్థులు, చార్మినార్ మండల పరిధిలో 3,217మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఈ సారి పరీక్ష రాసే విద్యార్థులకు 24 పేజీలతో కూడిన ఆన్సర్ షీట్ బుక్‌లెట్లను అందజేయనున్నారు. ఫిజికల్ సైన్స్, బయోసైన్స్‌కు గంటన్నర పాటు సాగే పరీక్షకు 12 పేజీలతో కూడిన బుక్‌లెట్‌ను ఇవ్వనున్నారు. సైదాబాద్ మండల పరిధిలో 23 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

మూడు ప్రభుత్వ పాఠశాలల నుంచి 428మంది, రెండు ఎయిడెడ్ పాఠశాలల నుంచి 102మంది, 18 ప్రైవేటు పాఠశాలల నుంచి 3,684 మంది, మాట వినికిడి లోపం ఉన్న విద్యార్థులు 23 మంది, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ నుంచి 108మంది, గురుకులాలు, ఇతర రెసిడెన్షియల్ స్కూళ్ల నుంచి 786మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్నారని డిప్యూటీ ఈవో రాధాకృష్ణ తెలిపారు.

### చార్మినార్‌లో 3,217 మంది విద్యార్థులకు 20 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

పదో తరగతి పరీక్షల సందర్భంగా చార్మినార్ మండల పరిధిలో ఏర్పాటు చేసిన 20 పరీక్షా కేంద్రాల్లో 3,217 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాట్లు చేసినట్లు డిప్యూటీ ఈవో సుజాత తెలిపారు. 16 ప్రభుత్వ పాఠశాలల నుంచి 381మంది విద్యార్థులు, 6ఎయిడెడ్ పాఠశాలల నుంచి 53మంది, 58 ప్రైవేటు పాఠశాలల నుంచి 2,185మంది, 11 గురుకులాలు, రెసిడెన్షియల్ స్కూళ్లకు చెందిన 598మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్నారని ఆమె వివరించారు.

### పరీక్షలకు ఏర్పాట్లు

ఈనెల 21నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగనున్న టెన్త్ పరీక్షలకు ముమ్మరంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఉదయ 9:30గంటల నుంచి 12:30 గంటల వరకు ఆయా సెంటర్లలో పరీక్ష లు జరుగనున్నాయి. 21న ఫస్ట్ లాంగ్వేజ్, 22న సెకం డ్ లాంగ్వేజ్, 24న థర్డ్ లాంగ్వేజ్, 26న గణితం, 28న సైన్స్ పార్టు-1, 29న సైన్స్ పార్టు-2 ఏప్రిల్ 2న సాం ఘీక శాస్త్రం, 3న మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1, 4న మె యిన్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్షలు నిర్వహించనున్నారు.

### ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు తమ పరీక్షా కేంద్రాలకు వెళ్లేందుకు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే వీలు కల్పించారు. ఈమేరకు విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు ఆర్టీసీ సిటీ బస్సుల్లో పదో తరగతి విద్యార్థులను పరీక్షా కేంద్రాలకు చేరవేసేందుకు ఏర్పాట్లు చేస్తుంది.

### మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదు

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోను పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావద్దని డిప్యూటీ ఈవో రాధాకృష్ణ తెలిపారు. ఒకవేళ ఎవరైనా తీసుకువచ్చినా వాటిని అనుమతించే ప్రసక్తే లేదన్నారు. పరీక్ష కేంద్రాల్లో ప్రత్యేకంగా నియమితులైన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌తో పాటు, ఇన్విజిలేషన్ చేసే ఉపాధ్యాయులకు కూడా మొబైల్ ఫోన్లు అనుమతి లేదని ఆయన వివరించారు.

## కోర్ బ్రాంచ్‌లపైనే మౌలిక సదుపాయాల భవిష్యత్

- నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ చైర్మన్ సహస్రబుదే



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎన్‌బీఏ చైర్మన్ సహస్రబుదే, జేఎన్‌టీయూ వీసీ టీకేకే రెడ్డి తదితరులు

**హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):** దేశంలోని మౌలిక సదుపాయాల భవిష్యత్తు కోర్ బ్రాంచిలైన సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల పైనే ఆధారపడి ఉందని నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) చైర్మన్ అనిల్ సహస్రబుదే అన్నారు. బుధవారం జేఎన్‌టీయూ వాటర్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌బీఏ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వంతెనలు, రహదారులు, డ్యామ్స్ నిర్మించే సివిల్ ఇంజనీర్లు లేకపోతే వ్యవసాయం, నీటి వనరులకు ఇబ్బందులు తప్పవన్నారు. మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సును తొలగిస్తే టాటామోటార్స్, మారుతీ వంటి ఆటోమొబైల్ కంపెనీలకు ఇంజనీర్లను ఎక్కడి నుంచి తీసుకురావాలని ప్రశ్నించారు. సివిల్, మెకానికల్ కోర్సులపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని ప్రిన్సిపాల్స్‌కు, జేఎన్‌టీయూ అధికారులకు సూచించారు. కోర్ బ్రాంచ్‌ల్లో అధ్యాపకులుగా పనిచేస్తున్న వారు ఏఐ, డేటాసైన్స్ వంటి మైనర్ డిగ్రీలు పూర్తిచేస్తే.. కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు ఏఐసీటీఈ అనుమతిస్తుందన్నారు.

### కాంట్రాక్ట్ అధ్యాపకులకు గుర్తింపు

విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులకు పూర్తిసమయం అందుబాట్లో ఉంటున్న కాంట్రాక్టు/అడ్‌హాక్ టీచింగ్ అసిస్టెంట్స్‌ను ఎన్‌బీఏ సెల్ఫ్ అసెస్‌మెంట్ రిపోర్టులో ఫ్యాకల్టీగానే పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు. నేషనల్ పాలసీ ఫర్ ఎడ్యుకేషన్ ప్రకారం విద్యాసంస్థల నాణ్యతను మూల్యాంకనం చేయాల్సి ఉందన్నారు.

### కన్సల్టెన్సీలను అప్రోచ్ కావొద్దు

ఎన్‌బీఏ అక్రిడిటేషన్ పోర్టల్‌లో డేటా ఫిల్లింగ్ కోసమని కాలేజీలు కన్సల్టెన్సీలను అప్రోచ్ కావాల్సిన అవసరం లేదని సహస్రబుదే స్పష్టం చేశారు. ఎన్‌బీఏ ఫార్మాట్లో అడిగిన డేటాను సమర్పిస్తే చాలన్నారు. భారత ప్రభుత్వం తీసుకువస్తున్న నేషనల్ డిజిటల్ ఆర్కిటెక్చర్ తరహా వ్యవస్థ ప్రపంచంలో మరెక్కడా లేదన్నారు. కార్యక్రమంలో ఎన్‌బీఏ సభ్య కార్యదర్శి అనిల్‌కుమార్ నాసా, ఒడిశా ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఎస్ఎస్ పట్నాయక్, ఎంఎస్ రామయ్య యూనివర్సిటీ డీన్ రంగనాథ్, జేఎన్‌టీయూ వీసీ కిషన్‌కుమార్ రెడ్డి, రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు కామాక్షి ప్రసాద్, గిరిధర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కమర్షియల్ విద్యుత్ బిల్లుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

**హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):** పెండింగ్‌లో ఉన్న కమర్షియల్ విద్యుత్ బిల్లుల వసూళ్లకు దక్షిణ డిస్కం అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. రంగారెడ్డి జోన్‌లో పాతబకాయిల వసూళ్లు, అండర్ డిస్ కనెక్షన్లు, కమర్షియల్ బిల్లుల వసూళ్లకు రంగారెడ్డి జోన్ డీఈటీ కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నోడల్ టీమ్‌ను నియమించారు. నోడల్ టీంలో అసిస్టెంట్ అకౌంట్ఆఫీసర్, స్థానిక ఏడీఈ సభ్యులుగా ఉంటారు. బుధవారం బకాయిల వసూళ్లకు కాటేదాన్ తదితర ప్రాంతాల్లో స్థానిక ఆపరేషన్ వింగ్ ఇంజనీర్లతో కలిసి కమర్షియల్, కేటగిరి 3 సర్వీసులు పరిశీలించడంతో పాటు పాత బకాయిలు చెల్లించాలని వినియోగదారులకు సూచించారు. పలువురి నుంచి బకాయిలు వసూలు చేశారు. విద్యుత్ చౌర్యం, మీటర్ ట్యాంపరింగ్‌కు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## సినిమా నిర్మాణంలో కాస్ట్యూమ్స్ డిజైనింగ్ కీలక పాత్ర




వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

**రవీంద్రభారతి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):** సినిమా నిర్మాణంలో కాస్ట్యూమ్స్ డిజైనింగ్ కీలక పాత్ర పోషిస్తుందని సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అన్నారు. బుధవారం రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నితన్ అధ్వర్యంలో 'కాస్ట్యూమ్స్ డిజైన్ ఇన్ సినిమా వర్క్‌షాప్'ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడు రోజులపాటు జరిగే ఈ వర్క్‌షాపును ఔత్సాహిక సినీ ప్రేమికులు వినియోగించుకోవాలన్నారు. సినిమా రంగంలో అనేక విభాగాల్లో కాస్ట్యూమ్స్ డిజైనింగ్ ఒకటని అయితే సినిమా నిర్మాణంలో ఇది అత్యంత ముఖ్య పాత్ర పోషిస్తుందని అన్నారు. చిన్న సినిమా, పెద్ద సినిమా అనకుండా అన్ని సినిమాల్లో కథకు తగినట్లు కాస్ట్యూమ్స్ ఉంటేనే సినిమా విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీపాద్ మాచర్ల, అక్షరకుమార్ తదితరులు పాల్గొని నిర్వాహకుడు నితిన్‌రెడ్డిని సత్కరించి అభినందించారు.

## హెచ్‌సిటీ పనులకు భూసేకరణ పూర్తి చేయండి



అధికారులతో కలిసి భూసేకరణ పనులను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు

**హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):** గ్రేటర్‌లో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హెచ్-సిటీ పనులు ప్రారంభించేందుకు కావాల్సిన భూ సేకరణను త్వరితగతిన పూర్తిచేయాలని జీహెచ్‌ఎంసీ అడిషనల్ క మిషనర్ శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ జోన్‌లో పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. పాటిగడ్డ ఆర్‌ఓబీ, రసూల్ పుర ఫ్లైఓవర్, ఏఓసి చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం, ఆర్‌కేపురం, చిలకలగూడ ఆర్‌యూబీ పనులకు స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ రోహిణి, టౌన్ ప్లానింగ్ అధికారులు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాములు నాయక్ పాల్గొన్నారు.

## నేడు, రేపు ఎంసీహెచ్‌ఆర్డీలో ప్రిజన్ కాన్ఫరెన్స్




జాతీయ ప్రిజన్ సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర జైళ్ల శాఖ మాజీ ఐజీ ఎ.నరసింహ తదితరులు

**పంజాగుట్ట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి):** ప్రిజన్ సంస్థ ఆధ్వర్యంలో జైళ్లను పరివర్తన కేంద్రాలుగా ఏ విధంగా తీర్చిదిద్దాలి అనే అంశంపై దేశంలోనే మొట్టమొదటిసారిగా రెండు రోజుల పాటు నేషనల్ ప్రిజన్ కాన్ఫరెన్స్-2025 జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహిస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన జైళ్ల శాఖ అధికారులు, సీనియర్ ఐపీఎస్ అధికారులు, విద్యావంతులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విశ్వవిద్యాలయాల ఉపకులపతులు తదితరులు పాల్గొంటారని రాష్ట్ర జైళ్ల శాఖ మాజీ ఐజీ, ప్రిజన్ వరల్డ్ సంస్థ ఉపాధ్యక్షుడు ఎ.నరసింహ తెలిపారు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను సంస్థ సభ్యులు ఎ.అశోక్‌కుమార్, బినీత్ సింగ్, ఎల్.ఎం.చౌదరి,వినోద లక్ష్మితో కలిసి ఆవిష్కరించారు. సదస్సును గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభిస్తారని, రెండో రోజు ముగింపు సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. డీజీపీ జితేందర్, సంస్థ అధ్యక్షుడు, రాష్ట్ర జైళ్ల శాఖ మాజీ డీజీ వీకే సింగ్ తదితరులు హాజరవుతారని ఆయన చెప్పారు.

### బృందావన్‌కాలనీ సంక్షేమ సంఘం కమిటీ

**సరూర్‌నగర్ :** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 26వ డివిజన్ పరిధిలో గల బృందావన్‌కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కె.పృథ్వీరాథోడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రమేశ్‌గౌడ్, కోశాధికారిగా రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బాల్‌రాజ్‌చారి, సంయుక్త కార్యదర్శిగా రామూనాయక్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా సందీప్, మల్లేశ్‌తో పాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు తెలిపారు.

### చెత్త డబ్బాల ఏర్పాటు

**చాదర్‌ఘాట్, మార్చి 19(ఆంధ్రజ్యోతి):** ముసారాంబాగ్ డివిజన్‌లోని శాలివాహననగర్‌కాలనీ పార్క్‌కు వచ్చే సందర్శకులు, వాకర్లు చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా ఉండేందుకు జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 యూబీడీ ద్వారా కొత్తగా చెత్త డబ్బాలను ఏర్పాటు చేయించారు. వీటి ఏర్పాటు పనులను ముసారాంబాగ్ కార్పొరేటర్ భొక్క భాగ్యలక్ష్మీరెడ్డి బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో యూబీడీ సూపర్‌వైజర్ కృష్ణ, బీజేపీ నాయకులు పరశురాం, దినేష్, ఉమేష్ పాల్గొన్నారు.

### స్విమ్మింగ్ పూల్ ప్రారంభం

**వనస్థలిపురం :** బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ రెడ్ ట్యాంక్ వెనుకాల ఉన్న ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్‌ను బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి బుధవారం పునఃప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈస్ట్ స్పోర్ట్స్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, కాలనీవాసులు, కోచ్‌లు పాల్గొన్నారు.

### 'వన్ నేషన్-వన్ ఎలక్షన్'పై వర్క్‌షాప్

**మన్సూరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి):** 'వన్ నేషన్-వన్ ఎలక్షన్'తో దేశంలో అన్ని ఎన్నికలు ఒకే రోజు నిర్దిష్ట సమయ వ్యవధిలో నిర్వహించి సమయం వృథా కాకుండా దేశాభివృద్ధి చేయడమే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని వన్ నేషన్-వన్ ఎలక్షన్ కన్వీనర్ బి.అశోక్‌కుమార్ పేర్కొన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎల్బీనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో వన్ నేషన్-వన్ ఎలక్షన్ పై వర్క్‌షాప్ నిర్వహించారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్, పేరాల చంద్రశేఖర్‌రావు, కొత్త రవీందర్‌గౌడ్, కొప్పుల నర్సింహారెడ్డి, లయ, రాంరెడ్డి, కేశవరావు పాల్గొన్నారు.

### తాగునీటి ట్యాంకు ప్రారంభం

**రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 19(ఆంధ్రజ్యోతి) :** వేసవి దృష్ట్యా జిల్లా కోర్టులకు వచ్చే న్యాయవాదులు, కక్షిదారుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన తాగేనీటి ట్యాంకును జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభిరామారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

### ఎల్‌ఓసీ చెక్కు అందజేత

**వనస్థలిపురం :** వనస్థలిపురం డివిజన్ చింతలకుంటకు చెందిన బీ.యాదయ్య గత కొలంగా అనారోగ్యానికి గురైనాడు. అతని ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉండడంతో కాంగ్రెస్ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహయాదవ్‌తో కలిసి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.3లక్షల ఎల్‌ఓసీ చెక్కును నర్సింహ యాదవ్ బుధవారం అందజేశారు.

## నల్లవాగును పూడ్చేశారు.. ప్రభుత్వ స్థలాన్ని చెరబట్టారు !

- రియల్ సంస్థల కబ్జా నుంచి వాటిని కాపాడండి
- అధికారులకు మాజీ కార్పొరేటర్ సబిత వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సబితారాజశేఖర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి):** బాలాపూర్ మండలం మామిడిపల్లిలో కొత్తచెరువు నుంచి జల్‌పల్లి చెరువు వరకు గల నల్లవాగును, దాని పక్కనే ఉన్న సుమారు ఐదెకరాల ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాచేశారని, వాటిని కబ్జాబారి నుంచి కాపాడాలని మీర్‌పేట్ కార్పొరేషన్ 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మద్ది సబితారాజశేఖర్‌రెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె రంగారెడ్డి జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్, కందుకూరు ఆర్డీవో, బాలాపూర్ తహసీల్దార్ తదితరులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ నల్లవాగును మూసేయడంతో పక్కనే గల ఎయిర్‌పోర్టుకు సైతం వరద ముప్పు తలెత్తనున్నదని, కొత్తచెరువు నుంచి జల్‌పల్లి చెరువు వరకు వరద సాఫీగా వెళ్తేనే ఎలాంటి ముంపు సమస్యా ఉండదని అన్నారు. ఈ కాలువ పక్కన గల పెద్దమ్మ గుడి సమీపంలో ఒక కుంట సైతం ఉండేదని, దానితో పాటు పక్కనే గల సర్వే నంబర్.141లోని ఐదెకరాల ప్రభుత్వ భూమిని కూడా స్థానికంగా వెంచర్లు చేసిన ప్రెస్టీజ్, సిగ్నేచర్ రియల్ ఎస్టేట్ సంస్థలు కబ్జా చేశాయని ఆమె ఆరోపించారు. వెంటనే సదరు భూమిని సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి నల్లవాగును, ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆమె అధికారులను కోరారు.

## ఆధిపత్యం కోసం అల్లర్లు సృష్టిస్తే సహించం

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వనపల్లి శ్రీనివాస్, బీజేపీ కార్పొరేటర్ల హెచ్చరిక



మాట్లాడుతున్న వనపల్లి శ్రీనివాస్, బీజేపీ కార్పొరేటర్లు

**మన్సూరాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి):** ఆధిపత్యం కోసం ప్రశాంతంగా ఉన్న ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్లలో ప్రొటోకాల్ పేరిట ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అల్లర్లు సృష్టిస్తే సహించబోమని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు హెచ్చరించారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని బీజేపీ కార్యాలయంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, చింతల అరుణాసురేందర్‌యాదవ్, రంగ నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, నాయికోటి పవన్‌కుమార్‌లతో కలిసి బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎల్బీనగర్‌కు ఎమ్మెల్యేలుగా పనిచేసిన ఇంద్రసేనారెడ్డి, ఆర్.కృష్ణయ్యలు నాడు టీడీపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన కార్పొరేటర్లు ఉన్నప్పటికీ ఏనాడు ఆధిపత్యం ప్రదర్శించకుండా దౌత్య నియమాలు పాటిస్తూ అల్లర్లకు తావివ్వకుండా అభివృద్ధి పనులకు ముందుకు సాగించారని గుర్తుచేశారు. నియోజకవర్గంలోని పలు డివిజన్లలో కేవలం జీహెచ్‌ఎంసీ నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, శంకుస్థాపనలు చేసేప్పుడు స్థానిక ఎంపీ ఈటల రాజేందర్, కార్పొరేటర్లు లేకుండా చేయడంలో ఎమ్మెల్యే పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు నందికొండ గీత, బండారి భాస్కర్, పోచంపల్లి గిరిధర్, వివిధ డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వని కార్పొరేట్ పాఠశాల

- ఆందోళనకు దిగిన ఎన్ఎస్‌యూఐ

**ఎల్బీనగర్, మార్చి 19(ఆంధ్రజ్యోతి):** ఫీజు చెల్లించనిదే పదోతరగతి విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చేదిలేదనడంతో కర్మన్‌ఘాట్‌లోని ఓ కార్పొరేట్ పాఠశాల ఎదుట ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నేతలు ఆందోళనకు దిగారు. హాల్ టికెట్ల విషయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని ప్రభుత్వం చెప్పినా పాఠశాల ప్రిన్సిపాల్ పెడచెవినపెట్టి ఫీజు చెల్లించేంత వరకు హాల్ టికెట్లు ఇచ్చేది లేదని బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులకు తేల్చిచెప్పారు. విషయం ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులకు తెలియడంతో వారు వెంటనే పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడవద్దని పాఠశాల యాజమాన్యాన్ని హెచ్చరించారు. విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వారు ఎంఈఓను కోరారు. దీంతో దిగివచ్చిన పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌రెడ్డి, పలుసం శ్రీధర్‌గౌడ్, కందికంటి శ్రీధర్ గౌడ్, సుధీర్‌రెడ్డి, రోహిత్, ఆమెర్, సాయి, భాను, శివ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మంద కృష్ణ పోరాటంతోనే వర్గీకరణ బిల్లుకు ఆమోదం

**సరూర్‌నగర్ :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కొనసాగించిన పోరాట ఫలితమే తెలంగాణ అసెంబ్లీలో వర్గీకరణ బిల్లుకు ఆమోద ముద్ర అని రంగారెడ్డి జిల్లా మాజీ అధికార ప్రతినిధి బొర్ర రవి మాదిగ అన్నారు. వర్గీకరణ బిల్లుకు సభ ఆమోదం తెలిపిన సందర్భంగా బుధవారం ఎమ్మార్పీఎస్ బాలాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద సమితి ప్రతినిధులు సంబరాలు జరుపుకున్నారు. ఇక్కడి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి పూలమాల వేసి నివాళులర్పించారు. మంద కృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సమితి జిల్లా నాయకులు మస్కూరి సుధాకర్, ఆదిళ్ల అగ్రేశ్, జొన్నాడ యాదయ్య, బోయిని ఎల్లయ్య, నర్సింహ పాల్గొన్నారు.

**మన్సూరాబాద్ :** అసెంబ్లీలో ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టడంతో ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తిన సుధాకర్‌మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాల్లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. టి.ప్రకాశ్, రాజు, లింగం, నర్సింగ్‌రావు, దేవయ్య, సురేష్, మౌలాలి, దేవయాని శేఖర్ పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన సుజాత

- అండగా ఉంటామని నేతల భరోసా

**చంపాపేట, మార్చి 19(ఆంధ్రజ్యోతి):** హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బానోతు సుజాతానాయక్ బుధవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి తనకు జరిగిన అవమానాన్ని ఆయనకు వివరించారు. ఇటీవల ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తనపై చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల కలత చెందినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యల పట్ల పార్టీతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా ఉన్నట్లు మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే పట్ల పార్టీ యంత్రాంగం కఠినంగా వ్యవరించాలని పార్టీ శ్రేణులకు ఆదేశించినట్లు తెలిపారు. పార్టీ పూర్తిగా కార్పొరేటర్‌కు అండగా ఉంటుందని మహేష్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. అదేవిధంగా రాష్ట్ర ఆదివాసీ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్, సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెలగద్దర్, ఏఐసీసీ సెక్రటరీ చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్సీ కె.శంకర్‌నాయక్‌ను సుజాతానాయక్ కలిసి జరిగిన సంఘటనను వారికి వివరించారు. కార్పొరేటర్ వెంట టీపీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, కుంట్ల నర్సింహయాదవ్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్‌గౌడ్, నేలపాటి రామారావు, గణేష్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, జానకిరామ్ పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

**సైదాబాద్, మార్చి 19(ఆంధ్రజ్యోతి):** ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత కొరవడితే అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని, కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి హెచ్చరించారు. సింగరేణికాల నీ గుడిసెలు రోడ్డు నెంబరు-14లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె బుధవా రం ప్రారంభించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శిరీష, జలమండలి సూపర్‌వైజర్ శ్రీనివాస్, బస్తీవాసులు ఖదీర్, నేతాజీ నాయక్, సువర్ణ, గణేష్‌నాయక్ పాల్గొన్నారు.

### పారిశుధ్య నిర్వహణలో అలసత్వమొద్దు

**సైదాబాద్ :** పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది, అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం శంకేశ్వర్‌బజార్, సాయిరాంనగర్‌బస్తీలలో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలో చెత్త తరలింపు పనులు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని బస్తీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సూపర్‌వైజర్ సల్లావుద్దీన్, బస్తీవాసులు పాల్గొన్నారు.

### భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించాలి

**హయత్‌నగర్ :** భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఇంజాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల వద్ద ఆవిష్కరించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ప్రవీణ్, గోవర్ధన్, వివేక్, చరణ్, శివ, అఖిల, మౌనిక, స్వాతి, స్వప్న పాల్గొన్నారు.

### ఎంఐఎం ఆగడాలను అడ్డుకుంటాం

**సైదాబాద్ :** పాతబస్తీలో ఎంఐఎం ఆగడాలు సాగనివ్వకుండా అడ్డుకట్ట వేస్తామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా నూతన అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ అన్నారు. బుధవారం నిరంజన్‌యాదవ్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగాల హరిగౌడ్ సన్మానించారు. నిరంజన్‌యాదవ్ మాట్లాడుతూ ఎంఐఎం నేతలు కనుసన్నల్లో ప్రభుత్వం, కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల్లో సైతం పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా అభివృద్ధిని అడుకుంటే బీజేపీ చూస్తూ ఉరుకోదని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు శ్రీకాంత్‌రెడ్డి, మహేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ ఫెన్సింగ్ పోటీలకు 24మంది

**హైదరాబాద్(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ పోటీలకు తెలంగాణ నుంచి 24మంది ఎంపికయ్యారు. ఎల్బీనగర్‌లోని అక్షర ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన ఈ ట్రయల్స్‌లో మొత్తం 84 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఫాయిల్, సబ్రే, ఈపీ బాలుర విభాగంలో 12, బాలికల విభాగంలో 12 మంది జాతీయ పోటీలకు అర్హత సాధించారు. ఒడిశాలోని కటక్‌లో ఈనెల 27 నుంచి 30వ తేదీ మధ్య ఈ పోటీలు జరగనున్నాయని రాష్ట్ర ఫెన్సింగ్ సంఘం సెలెక్షన్ కమిటీ సభ్యుడు సందీప్‌జాదవ్ తెలిపారు.

## బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

**ఎల్బీనగర్ జోన్ బృందం :** రాష్ట్ర ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై ఎల్బీనగర్ జోన్‌కు చెందిన పలువురు మిశ్రమంగా స్పందించారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని కొందరు, కీలకమైన విద్య తదితర రంగాలకు ప్రాధాన్యం ఇవ్వలేదని మరికొందరు, అంకెల గారడీ తప్ప ఇందులో గొప్పతనమేమీ లేదని ఇంకొందరు అభిప్రాయపడ్డారు.


### బడ్జెట్ తప్పుల తడక, అంకెలు మోసపూరితం



రాష్ట్ర బడ్జెట్ తప్పుల తడక, అంకెలు మోసపూరితం. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలైన పెన్షన్ పెంపు, విద్యార్థులకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌ల ప్రస్తావన లేదు. నగరానికి కనీస నిధులు కూడా కేటాయించకపోవడంతో రాను రాను నిర్వహణ వ్యయం ఎక్కువ అవుతుంది. నిర్వహణ లేకపోతే నగర బ్రాండ్ ఇమేజ్ పోతుంది. దీంతో పెట్టుబడులు రావు. ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లుతాయి. మెట్రో రైలు ప్రస్తావన లేనేలేదు. విద్యా, వైద్యం, చేనేత, పారిశ్రామిక విధానాలలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.

– దేవిరెడ్డి సధీర్ రెడ్డి, ఎమ్మెల్యే, ఎల్బీనగర్

### అన్నివర్గాలకు ప్రోత్సాహం



తెలంగాణ ప్రగతి బాటలో నడిచేందుకు బడ్జెట్ ఉపయోగపడుతుంది. అన్నివర్గాలను దృష్టిలో పెట్టుకుని తయారు చేశారు. దీని వల్ల ఆర్థిక అసమానతలు తొలగుతాయి.

– ఎలే నర్సింహ, న్యాయవాది రంగారెడ్డి జిల్లా కోర్టు

### అన్ని రంగాలకు ప్రాధాన్యం



రాష్ట్ర బడ్జెట్ అన్ని రంగాలకు అనుకూలంగా ఉంది. అభివృద్ధితో పాటు సంక్షేమానికి పెద్దపీట వేసింది. షెడ్యూల్ కులాల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ పెద్ద ఎత్తున నిధులు కేటాయించి కాంగ్రెస్ పేదల పక్షపాతి అని మరోసారి నిరూపించుకుంది.

– పండుగల జయశ్రీరాజు, తాజా మాజీ చైర్‌పర్సన్, పెద్దఅంబర్‌పేట్

### బీసీల సంక్షేమం కోసం అత్యధిక నిధులు



బడ్జెట్‌లో బీసీల సంక్షేమం కోసం రూ.11,405కోట్లు కేటాయించడం హర్షనీయం. బడ్జెట్‌లో నీటిపారుదల శాఖ, వైద్యశాఖకు అత్యధిక నిధులు కేటాయించడం శుభపరిణామం.

– హుస్సేన్‌యాదవ్ బీసీ సంఘం నేత, చంపాపేట

## మన్సూరాబాద్‌లో కారు బీభత్సం

- యువకుడికి తీవ్రగాయాలు
- మద్యం మత్తులో కారుతో ర్యాష్ డ్రైవింగ్



వేగంగా దూసుకువచ్చిన కారు

**వనస్థలిపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) :** మన్సూరాబాద్‌లో అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. ప్రభాకర్‌రెడ్డి అనే వ్యక్తి వనస్థలిపురం నుంచి మద్యం మత్తులో అతివేగంగా కారు బుధవారం రాత్రి 11గంటల ప్రాంతంలో (టీఎస్07జేయూ5527) మన్సూరాబాద్‌కు వెళ్తుండగా పోచమ్మ ఆలయం సమీపంలో ప్రధాన రహదారిపై బైక్‌పై (ఏపీ29ఏజెడ్3419) తన చెల్లి నిఖితారెడ్డితో కలిసి వెళ్తున్న దివ్యాన్స్‌ను వేగంగా ఢీ కొట్టాడు. బైక్ హ్యాండిల్ కారుకు పట్టుకోవడంతో బైక్‌ను మూడొందల మీటర్ల వరకు కారు ఈడ్చుకెళ్లింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కారు బైక్‌ను ఢీకొట్టి ముందుకు వెళ్లే క్రమంలో మరో కారును ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో దివ్యాన్స్‌కు చేయి విరగ్గా, నిఖితారెడ్డికి గాయాలయ్యాయి. కారు నడుపుతున్న ప్రభాకర్‌రెడ్డి తలకు సైతం గాయాలయినట్లు పోలీసులు తెలిపారు. ప్రధాన రహదారిపై కారు బీభత్సం సృష్టించడంతో వాహనదారులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.